శివమెత్తిన కెరటం

'పైడిశ్రీ'

చిక్కటి చీకట్లను చీల్చుకుంటూ వేగంగా పరుగెడుతోంది రైలు.

కిటికీలోంచి వీస్తున్న చల్లటిగాలితో బాటు విసురుగా ఓ లావాటి వానచినుకు వచ్చి ముంజేతిమీద పగలిపోవడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు పిచ్చిరెడ్డి. దవడలు కటకటలాడుతూండగా ఆవులిస్తూ తనతోబాటే ప్రయాణిస్తున్న పంతుల్ని తట్టి లేపేడు.

ఉలిక్కిపడి మేలుకున్న పంతులు శ్వాస బలంగా వదిలి ఒళ్లు విరుచుకుంటూ "ఇప్పుడు బండెక్కడుందండీ రెడ్డిగారూ" అనడిగేడు.

"శీళ్ళలంక దాటినట్టుంది." అంటూ కిటికీలోంచి బైటకుచూసి చీకట్లో ఏమీ కనిపించకపోవడంతో యధాలాపంగా లోనికి చూస్తూ అనుకోకుండా ఎదురుగా పైనున్న బెర్తుమీదికి చూసేడు పిచ్చిరెడ్డి.

రాబోయిన ఆవులింత ఆగిపోయింది.

ఎక్కడెక్కి కూర్చున్నాడో గాని లచ్చిగాడు బెర్తుమీద ఓకాలు ముడిచి మరో కాలు ప్రక్కకి బారచాపి కూర్చుని కనిపించేడు ఎటుకేసో చూస్తూ. లచ్చిగాడు, పిచ్చిరెడ్డి, పంతులు ఒకవూరి వాళ్ళే. కడజాతివాడన్న కారణంగానో, కూలి నాలి చేసుకుని కడుపు నింపుకునే వాడన్న చులకన భావంతోనే, లేక ఎప్పుడూ దారిద్ర్యపు విషదంష్ట్రల్లో చిక్కి, చిక్కి శల్యమౌతూంటాడనో లక్ష్మయ్య అనే పేరుకు నీళ్లొదిలి అతణ్ణి 'లచ్చిగాడు' అనీ, 'లచ్చింగోడు' అని ఎవరికి తోచినట్లు వాళ్లు పిలవడం పరిపాటయిపోయింది.

తనకి నోటమాటరాక ప్రక్కన కూర్చున్న పంతుల్ని కుదిపి లచ్చిగాడి వేపు చూపించేడు పిచ్చిరెడ్డి.

లచ్చిగాడివేపు చూసి పంతులు కొయ్యబారిపోయేడు. "అమ్మ నాకొడుక్కి గిరెక్కిందండీ! మీరు యిక్కడ క్రింద కూర్చుని వుండే ఆ నాకొడుకు అంత

ఎత్తున అలా కూర్చోటానికి ఎన్ని గుండెలు కావాల." అని స్వగతంలో అనుకున్నట్లు పైకి అనేసి, పెద్దగా 'లచ్చిగా' అని అరిచేడు, షాక్ తిన్నట్టు.

లెక్కలేనట్టు చూసేడు లచ్చిగాడు వాళ్ళవేపు ఏమిటన్నట్టు. వాడు అలా చూడడం, అందులోని లెక్కలేనితనం గమనించిన పిచ్చిరెడ్డి మొహం కందగడ్డలా తయారయింది. ఆవేశం, కోపం అవధులుదాటి గుండెల్ని తన్నుకుని స్వరపేటికను పగులగొడుతుండగా చంద్ర నిప్పులా మండే కళ్ళతో ఉరిమిచూసేడు.

"ఏందిరా ఆ సూపు... ఎట్టినాకొడకా! ఇంత 'లావు' రెడ్డిగారు యిక్కడ కూకుండుంటే నువ్వా 'పెక్క'మీద దర్జాగా మారాజుబిడ్డ మాదిరి కూకోటానికి ఎన్ని గుండెల్రా?" గుడ్లురిమేడు పంతులు.

"మీతోబాటే నాను టిక్కట్టు కొన్లేదేటి?" ఎదురుప్రశ్న వేసేడు లచ్చిగాడు, కూర్చున్న పద్ధతి కొద్దిగా మార్పుచేస్తూ, సర్దుక్కూర్చుంటూ.

"రెడ్డిగోరు తానాలాడిన నీల్లతో గొంతు తడుపుకునేటోడివి, ఆయన కొట్టాంలో ఎద్దులేసిన పేడలో గింజల్ని ఏరుకుని గంజికాసుకు బతికేటోడివి.... వూరూర్నే కానీపేగల పెద్దమడిసి యీడ కూకుండుంటే పేదబురగ నాకొడకా నువ్వాడ కూకుంటావా! దిగు నాకొడకా" అదుపుతెచ్చుకున్న కోపాన్ని పొదుపుగా ఒలకబోసేడు పంతులు.

పంతులు మాటలకు లచ్చిగాడి మొహంలో రక్తం పొంగుకొచ్చింది. మొహం కోపంతో ముడతలుపడి ముప్ఫయ్యేళ్ళ లచ్చిగాడు అరవయ్యేళ్ళ ముసలాడిలా కనిపించేడు. వాడు కూర్చున్న భంగిమలో, తొడుక్కున్న చిరుగుల చొక్కాలోనూ, భుజమ్మీద తువ్వాలులోనూ, నల్లటి చారలురేగి గుంటలుపడ్డ కళ్ళలోనూ, కళ్ళల్లోంచి దూసుకువచ్చే 'ఎర్రటి' చూపులోనూ పంతులుకు వచ్చిన కోపంలాంటిదే చిటపటలాడుతోంది. ఆ క్షణంలో- పేదోడి కోపానికి, పెద్దోడి కోపానికి మధ్యవున్న అద్వైత బాంధవ్యం అంతర్లీనంగా ధ్వనింప సాగింది ఆ దృశ్యంలో.

"దిగమంటే అట్టా సూత్తావేరా!" రెట్టించాడు పంతులు.

"ఎందుకు దిగాల" మామూలుగానే అడిగేడు లచ్చిగాడు.

"ఎందుకు దిగాలా!?" ముక్కుమీద వేలేసుకుంటూ కనుబొమలు వెడల్పు చేస్తూ పిచ్చిరెడ్డివేపు చిత్తరవోతున్నట్లు చూసేడు పంతులు.

"అవునయ్యా ఎందుకు దిగాల! నేను అందర్లాటి మడిసినిగానా? మీ మాదిరి టిక్కట్టు కొన్లేదా? టిక్కట్టు కొని రైలెక్కినోడికి అది యిట్టవొచ్చిన కాడ కూకునే అక్కుంది. అవసరం పడితే యీడంటే అడ తొంగునే అక్కూవుంది. ఆ మాత్తరం తెలీవోల్లమనుకున్నావేటి?"

తనకు తెలిసినదాన్ని తెలియనిదానితో కలిపి తెలిసీతెలియనట్లు మాట్లాడిన లచ్చిగాడి మాటల్లో చాలా అపశృతులు పలికేయి.

"అచ్చరం ముక్కెరగని అద్దాసి నా కొడుకులా అక్కుల గురించి మాట్టాడే కాడికొచ్చేరండీ రెడ్డిగారూ. ఇదంతా తమ రిచ్చిన చనువే. ఇంకా అట్టా సూత్తూ కూకున్నారేటి. లెగిసి ఆ గమార్నా కొడుకుని నాలుగు జబుర్లు ఇవరకా?" పంతులు రెచ్చగొట్టినట్లు మాట్లాడేసరికి, అప్పటికే పట్టలేని కోపంతో వూగి పోతున్న పిచ్చిరెడ్డి పళ్లునూరుతూ దిగ్గున పైకి లేచి లచ్చిగాడివేపు 'పంజా' విసిరేడు,

అప్పటిదాకా అవాక్కయి చూస్తున్న కంపార్ట్మెంటులో వాళ్లంతా ఒక్కసారిగా చైతన్యం తెచ్చుకుని పిచ్చిరెడ్డి ఉక్కు బాహుల్లోంచి లచ్చిగాణ్ణి తప్పించి, లచ్చిగాడివేపు అసహ్యంగా ఏవగింపుగా చూస్తూ "ఎవరయ్యా నువ్వు. ఏమిటా మొండితనం. పెద్దాళ్లు చెబుతుంటే విని పించుకో వన్నా?" అంటూ రెడ్డిగారినీ పంతుల్నీ బెర్తుమీదికి పంపించి లచ్చిగాణ్ణి యింతకుముందు వాళ్లు కూర్చున్న సీట్లో కూర్చోబెట్టి పరిస్థితిని చక్కబరిచేరు.

"నా కింద కూకుని నా అడుగులకి మడుగులొత్తాల్సిన దేబిర్నాకొడుకులు పైన కూకోనుంటే కడుపు కార్చిచ్చుల బాన్నాది పంతులూ. అళ్ల అద్దంతియ్యడం యింకో చెణం ఆలిసమైనట్టయితే యీ పాటికి ఆ నాకొడుకు పేనాలు ఆకాసెంలో తేలేవి. రెడ్డిగారంటే ఏమనుకున్నాడో ఏమో" అంటూ గర్వంగా మీసంమీద చెయ్యేసి తిప్పుతూ తన రెండుకాళ్లు సరిగ్గా లచ్చిగాడి నెత్తిమీద వుండేట్లు ఎదురుగావున్న బెర్తుకి ఆనించి, విలాసంగా కదిలించ సాగేడు.... పిచ్చిరెడ్డి.

ఆ చెప్పుల తొళ్లు అలా కదుల్తుంటే రాలిపడే మట్టి లచ్చిగాడి నెత్తిమీద గుట్ట పడుతోంది. అది గమనిస్తూ పకపకా నవ్వుతుంటున్న పిచ్చిరెడ్డి, పంతులు మొహాలకేసి తీక్షణంగా చూసేడు లచ్చిగాడు. ఒక నిముషం తర్వాత వాళ్ల నవ్వుల్లో వున్న అర్థం గ్రహించి మింగేసేట్టు చూస్తూ "నెత్తిమీద మట్టి పడతాంది." అన్నాడు రెడ్డివేపు చూస్తూ.

"పడితే తీసి కళ్ల కద్దుకుని నోట్లో వేసుక్కో". అన్నాడు పంతులు రెచ్చగొట్టే ధోరణిలో.

ఆ మరుక్షణం టి.టి.ఇ. కంపార్టు మెంట్‌లోకి ప్రవేశించి "టికెట్ ప్లీజ్" అని గనుక అనకుండా వుంటే ఏం జరిగేదో మరి. అప్పటికి ఆ వేడి చల్లబడి పోయింది.

బైట సన్నగా తుంపర!

అర్థగంట ప్రయాణంలో రెడ్డిగారి తరపున వకాల్తా పుచ్చుకుని పంతులు 'కూసే కారుకూతల్ని' అతికష్టం మీద సహిస్తూ వచ్చేడు— లచ్చిగాడు. తన బల

హిన కోణాలమీద నిలబడి 'బంతాట' ఆడుకునే ఆ యిద్దర్నీ చూస్తోంటే ఆవేశం ఆకాశ పర్యంతమౌతూవున్నా ఎక్కణ్ణించో వచ్చి ప్రవాహంలా కమ్మేస్తున్న నిస్సహాయత అతన్ని నిర్వీర్యుణ్ణి చేసేసింది. తనలో తను ఏడ్చుకోవడం మినహా మరేం చెయ్యలేకపోయాడు. సరిగ్గా అప్పుడే ఆకాశవీధిలో వేగంగా పరుగెడుతున్న కొండలాంటి నల్లమబ్బు ఒకటి తొలి ఉరుము ఉరిమి, తొలిజల్లు కురిసి మిగతా మబ్బులకేసి గుర్లురిమి మెరుపు చూపొకటి చూసింది, నన్ను అనుసరించండి అన్నట్టు.

జోరున వర్షం.

కుళ్లగుంట స్టేషన్లో రైలాగింది. అక్కణ్ణించి ఆ గ్రామానికి వెళ్లాలంటే తూర్పుదిక్కుగా ఒకటిన్నరమైలు నడవాలి. రెడ్డిగారికోసం తయారుగా వున్న గుర్రపుబండిలో రెడ్డి, పంతులు ఎక్కేరు. లచ్చిగాడు పంచె బాగా పైకి ఎగదోపి, చొక్కావిప్పి చుట్టచుట్టి చంకనెట్టి భుజమ్మీద చిల్లులతువ్వాలు నెత్తికి చుట్టుకుని నడక సాగించేడు.

రెడ్డిగారి బండి అతన్ని అవహేళన చేస్తూ దాటిపోయింది. ఆ బండి తాలూకు గొప్పతనం గుర్రపుడెక్కల చప్పుడులో కలగలసిన వర్షంలో ప్రతిధ్వనిస్తూనే వుండిపోయింది.

ఆదే సమయంలో—

భూనభోంతరాళాలు దద్దరిల్లేట్లు కొండలాంటి ఉరుము: దాని వెనకే కళ్లల్లోంచి కంటిపాపల్ని పుటుక్కున తెంపేసి చంటిపాపల్లా ఏడిపించగల తెలుగు మెరుపు. ఆ మెరుపు వెలుగులోనే తప్పిపోయిన తన దారిని సరిచేసుకుని అసలు దారికి వచ్చేడు లచ్చిగాడు.

చుట్టూ చీకటిగుండంలాంటి రాత్రి: చెంపల్ని, వీపుని చేతికి అందిన ప్రతి అవయాన్ని చెళ్లున చరుస్తూ అడుగడుక్కీ బెదిరించే వాన: అన్నింటిని మించి అతని ఓపికకు పరీక్షపెడుతూ చెప్పులు లేని కాళ్లతో చిక్కుపడిన నిస్సత్తువ. అయినా లచ్చిగాడి నడక ఆగలేదు.

* * *

మూడు రోజులుగా—

సన్నగా దట్టంగా తగ్గుతూ హెచ్చుతూ కురుస్తూ వెలుస్తున్న వర్షం పిచ్చివాడి అర్థంలేని నవ్వులా వుంది. ఆ వర్షాన్ని కుళ్లగుంట గ్రామస్థులు అంతగా పట్టించుకోకపోయినా ఆ వూరికి అరమైలు దూరంలో వున్న గంగచెరువు మాత్రం వర్షజలంతో పీకలదాకా మునిగి విందు చూలాలు మాదిరి నొప్పులు పడుతోంది. మూడురోజులుగా వెలుతురు మొహం చూడకుండా గూటిలో గువ్వల్లా యిళ్లలో ముడుక్కున్న జనానికి యీ సంగతి తెలీదు. ఒకరూ అరా బైటికొచ్చినా ఎవరూ చెరువు దాపులకు వెళ్లలేదు.

వున్నదేదో వండుకు తినటం, ఊపిరి ఉసురు తగ్గేదాక నిద్రపోవడం, మధ్యలో వర్షం రవంత తెరపిస్తే కాలకృత్యాలు ముగించుకోవడం, రేడియో వున్నవాళ్లు వాతావరణ హెచ్చరికలు వినడం. ఆ హెచ్చరికలపట్ల ఆసక్తిలేనివాళ్లు జన రంజని రికార్డులు వినడం—యివి మూడు రోజులుగా ఆ వూళ్ళో మనుషులు పడి పోయిన యాంత్రిక చర్యలు. ఈ చర్య లకు బద్ధులై బయట ప్రకృతిలో జరిగే మార్పుల్ని అంతగా పట్టించుకోలేదెవరూ.

వాచీలు ఉన్నవాళ్లకు తప్ప అప్పుడు సమయం ఒంటిగంటయిందని తెలీదు చాలామందికి.

సరిగ్గా అప్పుడే రేడియోలోంచి తుపాను హెచ్చరిక వినబడింది. ఆ నోట ఆ నోట పాకి అది వూరంతా పాకి పోయింది. అంత వర్షంలోనూ జనంలో ఒకలాంటి అలజడి. జీవితంపట్ల పేరుకు పోయిన ఆశ వాళ్లని నానా రకాలుగా ఆడించసాగింది.

అన్నం కుండలు గడగడలాడేయి.

దండెం మీద ఆరవేసిన దుప్పట్లు శరీరాలకు అల్లుకుపోయేయి.

పాత పంచెలు, లుంగీలు, తువ్వాళ్ళు తలపాగా లైనయ్.

పొగాకు కాడలు, బీడీలు, సిగరెట్లు, అగ్గిపెట్టెలు శరీరంలో తడి తగలని మూలలకు చేరుకున్నాయి.

పూరికొంపల్లో వుండేవాళ్లంతా పెద్ది రెడ్డిగారి మిద్దింటికి చేరుకున్నారు. రెడ్డి గారికి యీ మధ్య హైదరాబాదు పిల్ళ్ళు తగిల యింట్లో మొజాయిక్ ఫ్లోరింగ్, పెద్ద పెద్ద వాల్ పేపర్ పెయింటింగులు. జరీ అంచు పరదాలు, ఖరీదైన సోఫాసెట్లు, ఘుమ్మెత్తించే సెంటువాసనలు వెలిసి నయ్. వాటిని తనవూరి అలగాజనంతో మలినంచేయడం యిష్టంలేక "గోడల్లో పగుళ్లు చూసేరా....! తుపాను యింకా చెలరేగితే యిది వుంటుందో, కూలి పోతుందో తెలీదు! అంచేత మీరంతా ఆ బడికొట్టంలోకి వెళ్లండి. హెడ్మాస్టారి నడిగి మీకు తాళాలు యిప్పిస్తాను" అంటూ అందర్నీ బడికొట్టంలోకి నెట్టేసేడు పెద్దిరెడ్డి.

ఆ విషయమేమీ పట్టనట్టు తన చుట్టు గుడిసెలో ఓ మూల్న ఒదిగి కూర్చుని 'మూరుబువ్వ' త్రాగుతూ తన పడుచు పెళ్లాంతో సరసాడుతున్నాడు లచ్చిగాడు. 'ఇంకా వారం రోజులకు సరిపడే గింజ లున్నాయి. ఈ వాన యింకో వారం కురిసినా ఫర్వాలేదు.' ఇదీ వాడి ధీమా.

ఉట్టిమీద అడుగు ముంతలో దాచిన ఉల్లిపాయ మొగుడికి అందిస్తూ, "ఇదో మడిసీ .... బూదినటం తొరగా కానీ, జనమంతా పెద్దిరెడ్డోరి మిద్దింటి కెల్తన్నారూ" అంది మూలచ్చిమి తొందర పెడుతున్నట్లు.



"ఎందుకంట?" అందుకున్న ఉల్లి పాయను పరపరలాడిస్తూ అడిగేడు లచ్చిగాడు.

నిర్లక్ష్యంగా అడిగిన మొగుడుకేసి విచిత్రంగా చూసింది మాలచ్చిమి.

"ఎందుకేటి? ఇయ్యాల గొప్ప తుఫానుందని రేడియావోళ్ళు సెప్పిర్రంట. ఇందాక ఉప్పు పెట్టించుకోటానికొచ్చి అసిరమ్మ సెప్పినాది."

"అందుకని?" లచ్చిగాడు నిర్లక్ష్యంలో మార్పులేదు.

"పెద్దిరెడ్డిగోరి మిద్దింటికి తర్లెల్లిపోతున్నారు జనం. అల్లెంట మనంకూడా ఎల్దాం, అదీ యిసియం" కోపంగా తారస్థాయిలో ప్రారంభించిన మాట కొసరు నవ్వులాంటి నవ్వుతో ముగించింది మాలచ్చిమి

పెద్దపెట్టున నవ్వేడు లచ్చిగాడు. కంచం తీసేస్తూండగా మొగుడు నవ్విన నవ్వుకు నాజూగ్గా ఉడుక్కుందామె.

"ఒసే మాలచ్చివేఁ! తుఫానుకి బయపడి అందరం ఆ పెద్దిరెడ్డోరి మిద్దింట్లో సేరినమనుకో. అప్పుడు వున్నట్టుండి ఆ మిద్ది కూలిపోనాదనుకో. అపుడేటి మన గతి?" మాలచ్చిమినే చూస్తూ అన్నాడు లచ్చిగాడు.

"అర్ని జిమ్మడిపోను, నీ నోరు సచ్చుబడిపోను. నోరు తెరిస్తే మంచి మాట ఒకటీ రాదుగా. ఎవురన్నా యింటే ఏటమకుంటారంటా?" అని నేలమీది మెతుకుల్ని పూడుస్తూ, "ఇసుమంటి ఎర్రి మొర్రి ఆలోచన్లుండబట్టే మనం యీ గుడిసెల్లో; ఆ మారాజులు మిద్దిళ్ళల్లో" అంది, తన సహజ వేదాంత ధోరణిలో.

"ఓసిసీ.... ఎంత నాజూగ్గా సెప్పినావే" అంటూ మాలచ్చిమిని వెనగ్గా

కౌగిలించుకుని ఒక్కిరిబిక్కిరి చేయ సాగేడు లచ్చిగాడు.

"ఇదుగో.... ఏటది.... ఒదులు...." విదిలించుకోబోయిందామె.

"అటు_బైటికి సూడు. వాన ఎంతగా దంచేస్తోందో"

"దానికి దీనికీ ఏటి సమ్మందం?"

"వుంది. ఇవరంగా చెబుతా రా" అంటూ కాలితో తడికని మూసేసి మాలచ్చిమిని మంచంమీద దొర్లించి ప్రక్కన చేరేడు లచ్చిగాడు. ఆ తర్వాత చాలాసేపటికి అలసిపోయి ఒకరికేసి ఒకరు చూసుకుంటూ ఒకరి గుండెలమీద స్వేదబిందువుల్ని మరొకరు లెక్కపెట్టు కుంటున్న సమయంలో బైట ఎవరో అనుకుంటూ పోతున్నారు. "పెద్దిరెడ్డోరి మిద్దిల్లు కూలిపోయిందంట. పీచు మిగల్లే దట".

ఆ మాటలు వినిపించి లచ్చిగాడు, మాలచ్చిమి ఒకరి మొహాలొకరు చూసు కున్నారు. మరుక్షణం ఆమె మొగుడి ప్రక్కలోంచి లేచి రవికె తొడు క్కుంటూ "నీ నోరేం నోరు. నీ నోట్లో మట్టిగొట్ట. నువ్వు అన్నావు, ఆ మిద్దిల్లు కూలింది" అంటూ రవికె ముడేసుకుంటూ అంత వానలోనూ వీధిలోకి పరుగు తీసింది, నలుగురితోపాటు. అలా నలు గురితోబాటు పరుగెత్తక ఒకచోట చేరిన కొందరికి ఆ వార్త వీనులవిందుగా వుంది.

"కూలాలి ఇంకా కూలాలి. ఆ ఖాలంలో కోతకొచ్చింది సూడూ, ఆ పంటకూడా పీచు మిగలకుండా రాలి పోవాల. అది 'సరవ స్తం' ఏ బగ్గికో బుగ్గయిపోవాల"

"ఏట్రా ఆ పాడుమాటలు?"

"లేకపోతే ఏటి? అది మిద్దికి వాళ్లెత్తిం దెవరు. రేయింబగుళ్లు పిట్రపొట్టు లెక్కెట్టుకోని పట్టేసి అంత అందంగా మిద్ది కట్టిందెవరు? మనం అనుకొంటే మనల్ని అది మిద్దిలోకి రానిస్తే ఆదేద బురదవుద్దోనని మిద్ది కూలిపోయేటట్టుంది అని సాకు సెప్పి అందర్నీ యీ బిడి కొట్టంలోకి తోల్నాడు. దేవుడి దయవల్ల ఆడు సెప్పిన సాకే నిజమై కూకుంది."

ఇలా మాట్లాడుకునేవాళ్ళు మినహా, మిగతా వూరువూరంతా రెడ్డిగారి మిద్దింటి ముందు సమావేశమైంది. ఈదురుగాలికి, కుళ్లుచిమకులు తోడై చెంపలు పగల గొడుతున్నా ఆ సమావేశం అలానే సాగింది. అయితే అది ఎంతసేపో కొన సాగలేదు. దూరాన్నుంచి వినిపించిన ఒకానొక వర్తమానం దాంతో చెల్లాచెద రయింది. ఆ వర్తమానం ఏమిటంటే: "గంగ చెరువు కట్ట తెగి 'ఎల్లవ' వూరి మీద పడతాంది.... ఎలిపోండెలిపోండి"

ఆ వార్త విని కొన్ని వెదురుగుండెలు చదునయి పోయేయి. మరి కొందరు స్పృహ కోల్పోయేరు. అప్పుడే స్పృహలో కొచ్చినవాళ్లు కాలికి అందిన బాటన పరుగు లంకించుకున్నారు. కొందరు హావావుడిలో వెల్లువకు ఎదురు పరుగెత్తారు. అయితే

వేం.... ఒక్కర్ని వదలకుండా తన బాహువుల్లో ఎత్తిపట్టుకుంది శివాలెత్తి వస్తున్న వరదకెరటం.

* * *

గంటకి నూరుమైళ్ళ వేగంతో ఊదుతు గాలి గండిపడ్డ గంగచెరువు, గాడి తప్పిన గోదారిపాయ కూడ బలుక్కొని కళ్ళగుంట గ్రామాన్ని నీళ్ళగుంటగా మార్చేసేయి. ఉధృతి తగ్గని ప్రవాహంలో పశువుల మానవ కళేబరాలు, తాటి దుంగలు, జీవచ్ఛవాలు ఇక్కడ మునిగి అక్కడ తేలుతూ అక్కడ మునిగి యిక్కడ తేలుతూ దారీతెన్నూ లేకుండా ఎటో కొట్టుకుపోతున్నాయి. అంత మహా ప్రవాహంలో తన ఉనికి ఎక్కడో తెలీని ఓ తాటిచెట్టు గుబురుల్లో ప్రాణాలనుగ్గబట్టుకుని నెత్తురోడుతున్న చేతుల పట్టు వదలనివ్వక చెళ్ళు చెళ్ళున చెంపలు వాయించే యీదురుగాలికి కోతయిన కళ్ళ చినుకుల కేళీవిలాసాలకు భయంతో గాభరాగా కళ్ళు ఆర్పుతూ తెరుస్తూ వరద బీభత్సం కేసి చూడలేక చూస్తూ కూర్చున్నాడు లచ్చిగాడు, అంపశయ్య మీద కూర్చున్నట్టు. ఒంటిమీద ముద్దముద్దయిన చిల్లుల బనీను తప్పించి మరో నూలు పోగులేదు. మూగవాడి గుండెల్ని పగలగొట్టుకుని పొంగిన ప్రతీకారంగా విలయ నృత్యం చేస్తున్న వరదనీటికేసి చూస్తోంటే వాడి ఖర్మ కొలిమిలో కాల్చి నలగ్గొడుతున్నట్లు అయిపోయింది.

కనుచూపుమేర ఎటు చూసినా నీళ్లు! నీళ్ళు! నీళ్ళు! సుడులు తిరిగే నీళ్ళు. గర్జించే నీళ్ళు! ఆవేశంలాంటి నీళ్ళు! కోపంలాంటి నీళ్ళు! పాత చరిత్ర కొత్త చరిత్రని ప్రసరించి నీళ్ళు పోసుకున్నట్టున్న నీళ్ళు! సుడులు తిరుగుతూ, అగమ్యంగా పరుగులు పెడుతూ .... అందినదాన్ని దొరకబుచ్చుకుంటూ, కన్నతల్లిలా కడుపులో దాచుకుంటూ— నీటిమీద గడ్డికురుపుల్లా, పుట్టమచ్చల్లా రకరకాల శవాలు! రెండు గంటల క్రితం తనతో వరసాలాడి ఉడికించి వీధిలోకి వచ్చిన తన భార్య మాలచ్చిమి యీ శవాల్లో ఒక శవంగా ఈ శిధిలశకలాల్లో ఒక శకలంగా, బతికుంటే ఎక్కడో తనలాగే అనాధలా! పెద్దగా ఏడవాలనిపించింది లచ్చిగాడికి. ఏడుపు రాలేదు. నవ్వొచ్చింది.

అవును తనకి కన్నీళ్ళను పొదుపుచేసుకునే అవకాశం ఎక్కడిది. పుట్టి. పురిటి కంపుకొట్టింది మొదలు యిప్పటిదాకా వూహంతని జీవితపు మలుపుల్లో ఎదురు చూడని సంఘటనల్లో ఒంటరిగానో సామూహికంగానో ఏడ్చిఏడ్చి కళ్ళలోంచి జారి యీ వరదనీటిగా మారేయి. అవును జారి యిందాక ఈనీళ్ళలో యీదేటప్పుడు చాలా గుటకల నీళ్ళు లోనికి మింగేడతను. అచ్చం కన్నీళ్ళలాంటి రుచే. అవును తప్పక యివి కన్నీళ్ళే. పాపం, కాలం పునాదులు కదిలేట్లు, సృష్టిసర్వం

ప్రకంపించేట్టు, రవంత మానవత్వపు జాడకోసం, పస్తుల్లేని జీవితపు నీడకోసం తనలాగే ఎంతమంది ఏడ్చిన ఏడుపులో యీ నీళ్ళు! అవును. వాళ్ళు కూడా నాలాగే యిలా ఏదోచోట ఒంటరిగా కూర్చుని "ఇన్ని కన్నీళ్ళు నే నెప్పుడు కార్చేను" అనుకుని ఆశ్చర్యపోతుంటారు, తను ఆశ్చర్యపడ్డట్టు.

వచ్చి పచ్చి వూహాల తాలూకు పిచ్చి నవ్వొకటి లచ్చిగాడి పెదవుల మీద!

క్షణ క్షణానికి వరదనీటి మట్టం, ప్రవాహపు ఉధృతి పెరుగుతోంటే నీటి ఉపరితలానికీ తను కూర్చున్న చోటుకీ మధ్యదూరం తగ్గిపోతోంటేఏంచెయ్యాలో తోచనట్టు చుట్టుప్రక్కలకి పిచ్చి చూపులు చూడసాగేడు. అంతలోనే ఆతని భృకుటి ముడిపడింది. దూరంగా ఎవరో యీదుకుంటూ వస్తున్నారు.

ఎవరై యుంటారు? ఎవరైతేనేం చెట్టుమీదికి లాగి రక్షిస్తే పోలా? అమ్మో ఆ మనిషిని పైకిలాగబోయి తనూ నీళ్ళలో పడితే? భయపడ్డాడు లచ్చిగాడు.

అంత ప్రవాహవేగంలోనూ రెపరెప లాడే ఆశతో ఎండుటాకులా గడ్డిపోచలా నీళ్ళు త్రాగుతూ చచ్చుపడే చేతుల్ని కాళ్ళని పట్టుదలగా కదిలిస్తూ చావుకళ కబళించిన మొహంతో ఎదురుగా కనిపించే తాడిచెట్టుకేసి ఆశగా, భయంగా, కంగారుగా ఏడుస్తూ ఆలోచిస్తూ ఈదుకుంటూ మొండి ధైర్యంతో ప్రయాణించే ఆ ఆకారంకేసి చూసిన లచ్చిగాడు కొయ్యబారిపోయేడు.

పిచ్చిరెడ్డి! వూరూర్నే కాసీసేగల మారాజుకి ఎంత దుర్గతి. తన అభిజాత్యం తెచ్చిన పైత్యంతో అహంకారంతో అరుస్తూ, అరుపుల వెనుక అధముల ఆర్త నాదాల్ని సమాధిచేస్తూ తన అహంతో అధికారంతో వూరిని యిష్టారాజ్యంగా పాలిస్తున్న యిద్దరు రెడ్లలో ఒకడు.... పిచ్చిరెడ్డికి పాపం ఎంతటి కాని కాలం! అచ్చం తనలాగే ప్రాణభయంతో, జీవితం మీద ఆశతో, ఏడ్చుకుంటూ, తలవరపడుతూ, కాలాలకు మొక్కుకుంటూ, కన్నీళ్ళను వరదనీళ్ళతో కలిసి త్రాగుతూ, నీళ్ళమీద దొక్కుకుంటూ:

అంటే, కాలం జరిపే విచారణలో ఎవరి విషయంలోనూ హెచ్చుతగ్గుల్లేవన్నమాట.

లచ్చిగాడు గుండెల్లో బరితెగించిన అడదానిలాంటి నవ్వు, పైకి నవ్వలేదు. తనువున్న చెట్టువేపే యీదుకుంటూవచ్చిం మొండిగా గుడ్డిగా చెట్టును కౌగిలించుకుని తలవాల్చేసిన పిచ్చిరెడ్డినే వింతగా చూడసాగేడు లచ్చిగాడు.

అతణ్ణి చెట్టుమీదికి లాగితే? ఒద్దొద్దొద్దొద్దు! ఏం ఎందుకని?

ఊరవతల చింతచెట్టు ఎక్కి ఆ వేళ్ళకి కూరకి పనికొస్తుందని చింత చిగురు కోసుకుంటుంటే పాలేళ్ళచేత

రాళ్ళువేయించి తనని క్రిందకు పడగొట్టి, గొంతుమీద కాలు నొక్కిపెట్టి వికృతంగా నవ్విన రెడ్డి, యితడే! ఒంట్లో సత్తువలేక ఒకపూట పనిలోకెళ్ళనందుకు నడివీధిలో పదిమందీ చూస్తుండగా కిర్రు చెప్పుల కాళ్ళతో తనని పొర్లించి తన్నిన రెడ్డి ... యితడే!! ఇంతెందుకు మొన్నటికి మొన్న రైల్లో వస్తుంటే 'తన కన్న పైన' కూర్చున్నందుకు జుట్టుపట్టి లాగి పీక నులమబోయిన రెడ్డి యితడే! తను జోరువానలో నడుస్తోంటే గుర్రబగ్గిలో పరిహాసిస్తూ సాగిపోయిన రెడ్డి....ఇతడే! పిచ్చిరెడ్డి!!

అటువంటి రాక్షసుణ్ణి యిప్పుడు తను పైకిలాగి రక్షించాలా? పాపం .. ఈ రెడ్డి అప్పటి 'రెడ్డి' కాదు. అచ్చం తన్లాగే యీడ్చితన్నిన వరదతాపుకు కీళ్ళు విరిగి చావులో లేదా దావ్వబతుకుల సంధ్యాకాలపు నెత్తుటి నీడల్లో జీవన పోరాటపు సమానత్వ సూత్రాన్ని కళ్లారా చూపిన రెడ్డి! తను చూస్తూ వూరుకుంటే తన కొరిగేదేంటి 'ఆ అయ్యనట్టాగే ఒడిలేత్తే అయనకీ నాకూ తేడాయేటి? వుంటే అదిపాపం అదికే వుంటుంది." అనుకుంటూ మెల్లగా జాగ్రత్తగా తూచితూచి ఒక్కో అంగుళం క్రిందికి జారి సరిగ్గా నెత్తిమీద ఆగి "అయ్యా!" అని పిల్చేడు. ఆ పిలుపుకు భయపడో, అదిరిపడో, ఉలిక్కిపడో పట్టుతప్పి నీళ్ళలోకి జారబోయిన పిచ్చిరెడ్డిని బలమంతా ఉపయోగించి పైకి లాగాడు లచ్చిగాడు. తన మొహంలోకి పసిపిల్లాడిలా చూస్తున్న పిచ్చిరెడ్డి కళ్ళలో ఉబికే వెలుతురు కన్నీళ్ళకు చలించిపోతూ 'పర్లేదయ్యా నేనే! లచ్చిగాణ్ణి! తవరు నాసింత ఓపిక సేసుకుంటే సెట్టుమీదకి సేరేస్తాను." అన్నాడు. ఒక చేయి తనకి అందించి మరోచేత్తో చెట్టుపైకి ప్రాకలేక ప్రాకుతున్న లచ్చిగాడివేపు చూస్తోంటే రెడ్డిగారి గుండెల్లో లజ్జ, బిడియం, కుమ్మక్కయి పోట్లాడుకోసాగినయ్.

"ఒరే లచ్చిగా!" ఆర్తిగా పిల్చేడు పిచ్చిరెడ్డి.

"ఏందయ్యా!" ప్రాకడం ఆపి క్రిందికి చూస్తూ అడిగేడు లచ్చిగాడు.

"కాస్తంత ఆగరా...."

"ఎందుకయ్యా!"

సరిగ్గా తన నెత్తిమీద వున్న లచ్చిగాడి నెత్తురోడే పాదాన్ని పవిత్రంగా స్పృశించి కళ్ళకద్దుకుంటున్న పిచ్చిరెడ్డివేపు కలవరపడుతూ చూసేడు లచ్చిగాడు.

"అయ్యా .... ఏటయ్యా . ఏటా పిచ్చి సేష్టలు!?."

"పిచ్చి చేష్టలు కాదురా. వరదనీళ్లలో చిక్కుకోకముందే ఏడుకొండల ఎంకటేసుల్ని, యింకా గుర్తొచ్చిన దేవుళ్ళనందర్నీ మొక్కుకున్నాను. ఏ దేవుడూ నన్ను రక్షించలేదు. ఇదుగో ఈ దేవుడు మాత్రం రక్షించాలని చూస్తున్నాడు.

కానారే లచ్చిగా .... నిన్ను కాల్లతో తన్నినాను గదరా. ..కొరడాల్తో గొడ్డును బాదినట్టు బాదినాను గదరా .... పిడికెడు మెతుకులిచ్చినందుకు పుట్టెడు చాకిరీ చేయించుకున్నాను గదరా ... అయ్యన్నీ ఏటి గుర్తులేవా ... గుర్తుంటే నన్ను పైకి లాగవురా. ఇట్నుంచికే నీల్లలోకి యిసిరేత్తావు." చెట్టు బోదెను కావిలించుకుని పిచ్చాడికిమల్లే ఏడుస్తున్నాడు పిచ్చిరెడ్డి.

ఒక ప్రక్క నరాల్లో జీర్ణించుకుపోయిన అహం: రేపు తను బ్రతికి బట్టగట్టినా పదిమంది ముందు తనని ఒక అధముడు రక్షించాడని ఒప్పుకోగలడా? ఆ విషయం క్షణం క్షణం గుర్తొస్తొంటే ఆ బాధకు తను తట్టుకోగలడా... ! వరద ఉరవడి హెచ్చి కాళ్ళ దగ్గర తారాడుతున్న నీటి ఉపరితలాన్ని భయంగా చూసేడు పిచ్చిరెడ్డి ఆలోచనలకు స్వస్తి చెబుతూ.

"అట్లాగనకండయ్యా. అయినా .... అయ్యన్నీ గేపకం చేసుకుని తిట్టుకుంటూ కూకునే యాల కాదిది..." లచ్చిగాడి మాట పూర్తికాలేదు.

వెనకనుండి, కాటుకోసం పొంచివున్న కరికాలనాగులా పడగెత్తిన పెద్ద కెరటం ఒకటి దూసుకొచ్చి రెడ్డి శరీరాన్ని ఎగరేసుకుపోయింది. అప్పటికే ఆ కెరటం కడుపులో చాలామంది పిచ్చిరెడ్డిలాంటి మరికొందరు పిచ్చిరెడ్లు: కులం కోసం, మతం కోసం, బలహీనులపై అధికారం కోసం, ప్రాంతీయతత్వం రెచ్చగొట్టి పాలించాలని కలలుగన్నవాళ్ళు, నీతికీ అవినీతికీ మధ్య నిత్యం సంఘర్షించే వాళ్లూ యింకా చాలామంది వున్నారు ఇంకా చాలామంది మిగిలిపోయేరు. వాళ్ళందర్ని పడగొట్టి కడుపులో దాచుకోవాలన్నట్టు మెరుపువేగంతో సాగిపోయింది అచ్చం అగ్నివర్ణంలో వున్న కెరటం.

ఊహించని ఈ హఠాత్పరిణామానికి హతాశుడయ్యేడు లచ్చిగాడు. పిచ్చిరెడ్డి శరీరాన్ని నోట కరుచుకుని పరుగెత్తే కెరటం చటుక్కున ఆగి తను ఎక్కిన చెట్టుదగ్గర ఏదో గుర్తుపెట్టిపోవడం, ఆ గుర్తుదగ్గర పెద్ద సుడి ఏర్పడి సున్నాలు చుట్టడం గమనించిన లచ్చిగాడు పెద్దగా పట్టించుకోలేదు. తన చెట్టుదగ్గర సుడి గుండం చెక్కే 'శిలాక్షరాలు' రేపటి చరిత్రకు శ్రీకారం చుట్టేవని వాడికి తెలీదు. ఆ చరిత్రగతికి వాడే సారథి అన్న రహస్యం అంతకన్నా తెలీదు.